## క్లుప్తంగా

### వేడుకగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ కొత్తరోడ్‌లో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారి సన్నిధిలో మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. 21 రకాల పిండి వంటలతో అమ్మవారికి మహా ప్రసాదం నివేదన చేశారు. అనంతరం కాలనీ వాసులంతా సామూహిక భోజనాలు చేశారు. మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

### నియామకం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం ప్రాంతానికి చెందిన ఆకుల లోవరాజేశ్వరి మానవ హక్కుల అవగాహన సంఘం మహిళా చైర్ పర్సన్‌గా నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. రాజేశ్వరి సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పారిశ్రామిక వాసులకు సుపరిచితురాలు. సామాజిక స్ఫూర్తి గల రాజేశ్వరికి మానవ హక్కుల సంఘంలో చోటు లభించడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు ఆమెను అభినందించారు.

### కార్పొరేటర్ పీవీ సురేష్‌కు సత్కారం


60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్‌ను ఎఫ్‌బీడీఏ సంస్థ నిర్వాహకులు ఆదివారం ఘనంగా సత్కరించారు.స్థానిక కళావేదిక వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్ మాట్లాడుతూ తన సంస్థ అయిన పి.వి.ఎస్ చారిటబుల్ ట్రస్టు సారథ్యంలో పదేళ్ల నుంచి నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో అత్యధిక యూనిట్లు రక్తం సేకరించి ఆపదలో ఉన్న వారికి సకాలంలో అందించినందుకు సంస్థ సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్ని ఇబ్బందులు కలిగినా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు వినోద్‌బాబు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### కంబాకొండలో బోటు షికారు


కంబాల కొండ కొలనులో బోట్లతో షికారు చేస్తున్న సందర్శకులు

ఆరిలోవ: పర్యాటక కేంద్రం కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో సందర్శకులు సందడి చేశారు. కార్తీక మాసం రెండో ఆదివారం కావడంతో సందర్శకుల తాకిడి నెలకొంది. అధిక సంఖ్యలో వనభోజనాలు జరుపుకొన్నారు. ఇక్కడ ప్రశాంతమైన వాతావరణంలో గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. పిల్లలు ఆటపరికరాల వద్ద సరదాగా ఆడుకొని గడిపారు. ఇక్కడి కొలనులో ఎక్కువ మంది సందర్శకులు కయాకింగ్ బోట్లు, ఫ్యామిలీ బోట్లు, రౌండ్ బోట్లలో షికారు చేశారు. దీంతో ఈ కొలను వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా మారింది. సుమారు 400 మంది కంబాలకొండ పార్కును సందర్శించారు. వారి ద్వారా రూ. 26,000 ఆదాయం సమకూరినట్లు కంబాలకొండ నిర్వాహకులు తెలిపారు.

# అమ్మో.. ఆ రోడ్లు!

**మట్టి రోడ్ల కన్నా అధ్వానం**
- పైపులైన్ పనులతో అస్తవ్యస్తం
- సక్రమంగా పూడ్చని గోతులు
- మట్టి, రాళ్లు తేలిన సీసీ రోడ్లు


రామ్మూర్తిపంతులపేట మలుపులో రోడ్డు ఇలా..


అధ్వానంగా గౌరీనగర్ రహదారి


గోకుల్‌నగర్ రైల్వేట్రాక్ సమీపంలో రహదారి దుస్థితి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలోని పలు కాలనీల రోడ్లు అధ్వానంగా మారాయి. మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. ఆ రోడ్ల మీద ప్రయాణం చేయడానికి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు.

**అస్తవ్యస్త పనులతో అవస్థలు**

యూజీడీ అండ్, 24/7 పైపులైన్ల కోసం తీసిన గోతుల్లో పైపులు వేసి గోతులు సక్రమంగా పూడ్చకుండా వదిలేశారు. ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు అంతంత మాత్రంగానే జీవీఎంసీ అధికారులు ముగించేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు 5 నెలలు కావస్తున్నా సీసీ రోడ్లు వేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు గోతులు మయంగా మారాయి. కంచరపాలెం–ఊర్వశికూడలి పరిధిలో గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారి నుంచి గౌరీనగర్‌కు వెళ్లే రహదారి, తోటవీధి, గోకుల్‌నగర్, దుర్గానగర్, చెవిటిరాములవీధి, రామ్మూర్తిపంతులుపేట, గవరకంచరపాలెం, దయానందనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మరీదారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

**స్పందించని అధికారులు**

రోడ్ల పరిస్థితిపై జోన్–5 ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే నాడు ఎన్నికల కోడ్ అంటు కాలయాపన చేశారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పుడైనా అధ్వానంగా మారిన రోడ్ల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**వార్డు ప్రజాప్రతినిధి నిండు సున్నా!**

వార్డు ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా వార్డు కార్పొరేటర్ జాడ కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో కూడా వార్డులో చేపట్టాల్సిన పనులపై చర్చించి నిధులు రాబట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**ప్రమాదాలకు ఆస్కారం**

రామూర్తిపంతులపేట, గొల్లకంచరపాలెం, గౌరీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో పైపులైన్ కోసం తీసిన మట్టి రోడ్లకు సగం మేర ఉండడంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆపై విద్యుత్ లైట్లు సక్రమంగా పనిచేయకపోవడంతో రాత్రి వేళ రాకపోకలు సాగించడం మరీ కష్టతరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇంజినీరింగ్ అధికారులతో సీసీ రోడ్ల నిర్మాణంపై మాట్లాడితే యూజీడీ, 24/7 ఆయా డిపార్ట్‌మెంటు అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు తవ్విన గోతులను వారే పూడ్చాలని చెబుతున్నారు.

**గోతులతో ఇబ్బందులు**

మా కాలనీలో గోతులు తవ్విన చోట కనీసం సీసీ రోడ్లు వేయలేదు. ఉన్న సీసీ రోడ్లు రాళ్లు తేలుతున్నాయి. ఆ రోడ్లపై కనీసం నడవలేక పోతున్నాం. ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని సచివాలయంలో ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. వర్షాలు పడితే గెడ్డవీధిలో గోతులు కనిపించక ఇబ్బందులు పడుతున్నాం.
–రాజబాబు, వాహనదారు, గౌరీనగర్, ఊర్వశికూడలి

**అధికారులు స్పందించాలి**

పైప్‌లైన్ పనులకు తవ్విన గోతులను పూడ్చలేదు. శిథిలమైన రహదారుల మరమ్మతులు పూర్తి చేయలేదు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ఆపేసినట్టు అధికారులు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచినా ఎన్నికల కోడ్ తొలగినా పనులు ప్రారంభించకపోవడం దారుణం. సంబంధిత అధికారులు స్పందించాలి..
– శ్రీనివాసరావు, గవర కంచరపాలెం.

## ఎంఐజీ కాలనీలో భారీ చోరీ

**18 తులాల బంగారు, 50 తులాల వెండి ఆభరణాల అపహరణ**

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. విలువైన బంగారు,వెండి వస్తువులను అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 60వ వార్డు పరిధి ఎంఐజీ కాలనీ క్వార్టర్ నెంబర్ 175లో బిహార్ రాష్ట్రానికి చెందిన శివప్రసాద్‌సింగ్ కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు.అయితే వీరు బంధువుల శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు గత వారం బిహార్ వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని ఆదివారం ఉదయం తిరిగి తమ ఇంటికి వచ్చారు. అయితే ఇంటి ముందు తలుపు తాళం విరిగిపడి ఉంది. అనుమానం వచ్చిన సింగ్ గదిలోకి వెళ్లి చూసే సరికి మంచి కింద వారు దాచిన 18 తులాల బంగారు నగలు, 50 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే మల్కాపురం క్రైం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఘటనా స్థలానికి క్రైం ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ ఎస్.వి.రమణలు చేరుకుని పరిసరాలను పరిశీలించారు.అనంతరం ఇంటికి ఇరువైపులా ఉన్న నివాసీయులను ప్రశ్నించారు.చుట్టు పక్కల సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగలను గుర్తించే పనిలో ఉన్నామని త్వరలోనే పట్టుకుంటామని వివరించారు.

## ఉల్లాసంగా...ఉత్సాహంగా..

- సమైక్యతను చాటిన వనవిహారం
- ఆడిపాడిన వుడాలేఅవుట్ వాసులు



ర్యాంప్ వాక్ చేస్తున్న మహిళలు, డీజేపాటలకు స్టెప్‌లు వేస్తున్న మహిళలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీ వాసులు ఎలాంటి కార్యక్రమాల్లో అయినా ప్రత్యేకంగా నిలుస్తారు. ఇదే క్రమంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం నగర శివారులోని మడసర్లోవకు పిక్నిక్‌కు వెళ్లారు. కాలనీలోని పిల్లలు, పెద్దలు అంతా వేడుకలో పాల్గొన్నారు. రోజు వారీ విధులతో బిజీ..బిజీగా ఉండే వారంతా ఒకే చోటకు చేరి రోజంతా ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. పిల్లలు, పెద్దలకు వివిధ రకాల ఆట పోటీలు నిర్వహించారు. స్టేజిపై నృత్యాలు, ర్యాంప్ వాక్‌లతో ఆదరగొట్టారు. వృద్ధులు సైతం స్టెప్పులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన పిల్లలు, పెద్దలకు అసోసియేషన్ నాయకులు బహుమతులు అందజేశారు.

### సామాజిక భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం:జీవీఎంసీ 58వ వార్డు కుంచమ్మకాలనీ పరిధిలో కోరమాండల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల కోరిక మేరకు కోరమాండల్ సంస్థ భవనం నిర్మించి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ జ్ఞాన సుందరం, సీనియర్ మేనేజర్(హెచ్ఆర్) ఆర్.శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గంతో చైర్మన్ సత్యనారాయణ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దుర్గానగర్‌లో దుర్గా యువజన సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. సేవా సంఘం నూతన చైర్మన్‌గా పల్లా సత్యనారాయణ, అధ్యక్షుడిగా రాధాకృష్ణ, ఉపాధ్యక్షులుగా కుప్ప పైడిరాజు, కె. ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా పాలమరశెట్టి రమేష్, సహాయ కార్యదర్శిగా ధూళి భూషణ్, కార్యనిర్వహణ కార్యాదర్శులుగా కె. చంద్రరావు, ఎస్. అనంత్‌కుమార్, కోశాధికారిగా డి.రాజు, ఆడిటర్లుగా పల్లా శివ, ఎం.సత్యనారాయణ. మూర్తి, ఎస్ ప్రసాద్ ఎన్నికైనట్లు తెలిపారు.

## బోరుబావి బాగు చేయరూ!

ఫోకస్


జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ దరి తుమ్మడపాలెం రైల్వేట్రాక్ రహదారి ప్రాంతంలో మంచి నీటి బోరు మూలకు చేరింది. 37/57 నంబర్ బోరు నుంచి మంచినీరు రావడంలేదు. సమస్యపై మంచినీటి విభాగ సిబ్బందికి, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-5 మంచినీటి విభాగ అధికారులు పర్యవేక్షించి బోరుబావిని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. - కంచరపాలెం

## గోపాలపట్నంలో హీరో సుమన్ సందడి


కొత్తపాలెంలోని స్నేహితుడి ఇంట్లో సుమన్

విశాఖ విద్య: గోపాలపట్నం మండలం కొత్తపాలెంలో సినీ హీరో సుమన్ ఆదివారం సందడి చేశారు. కొత్తపాలెంలోని త్రినాథ్ అనే స్నేహితుడి ఇంటికి వచ్చిన సుమన్ చూసేందుకు పలువురు తరలివచ్చారు. తనను చూసేందుకు వచ్చిన వారందరినీ ఆయన ఆప్యాయంగా పలకరించారు. పలువురు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

### ఓటరు జాబితాల పరిశీలన


గోపాలపట్నం హైస్కూల్‌లో ఓటరు జాబితా పరిశీలన చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పశ్చిమ నియోజవర్గ పరిధిలో ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించారు. ఓటరు చేర్పులు, మార్పులతో పాటు సవరణలు, మృతి చెందిన వారి ఓట్లు తొలగించడానికి దరఖాస్తులు స్వీకరించారు. జాబితాలో ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నారు.

## జీతాలు పెంచకపోతే ఆందోళన చేస్తాం


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు


దాబాగార్డెన్స్: జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగంలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నా కేవలం రూ.15 వేలే జీతం ఇస్తున్నారని, ఇటీవల చేర్చుకున్న కార్మికులకు రూ.18 వేలు ఇవ్వడంలో ఆంతర్యమేమిటో అని జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ యూనియన్ నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌కుమార్, వెంకట్రావు, సీహెచ్ రాజు, రమణ, సత్యనారాయణ మాట్లాడారు. జీవీఎంసీ మంచినీటి విభాగంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అన్యాయం చేస్తున్న ఎస్ఈ కేవీఎన్ రవిని విధుల నుంచి తప్పించి, అతని అవినీతి, నియామకాల్లో అక్రమాలపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. డెత్, సిక్‌కి సంబంధించి వంద పోస్టుల వరకు భర్తీ చేయాల్సి ఉంటే.. అవి భర్తీ చేయకుండా అక్రమంగా డబ్బులు వసూలు చేసి 96 పోస్టులు ఎలా భర్తీ చేశారో తెలపాలని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అవినీతి అధికారి సాక్ష్యాలు తారుమారు చేయకుండా ముందుగా అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేసి, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిచో నీటి సరఫరా, ఇతర విభాగాల అవినీతి పైన సిటు పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

## బకాయి వేతనాల కోసం 104 ఉద్యోగుల ధర్నా


ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

సీతమ్మధార: గడచిన మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా 104 ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి. మణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వమే నేరుగా పీహెచ్‌సీల ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలని, 2020 తర్వాత నియమితులైన వారికి జీవో నంబర్ ఏడు ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్‌లో యాజమాన్య వాటా యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, 3 సంవత్సరాల అలవెన్స్‌లు, ఇంక్రిమెంట్ బకాయిలు చెల్లించాలని, వాహనాల నిర్వహణ (మరమ్మతులను) తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో సీఐటీయూ జిల్లా నాయకుడు జి. అప్పలరాజు, అధ్యక్ష, కార్యదర్శులు తాతబాబు, భాస్కర్, జిల్లా కమిటీ నాయకులు భవ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దల ప్రోత్సాహంతోనే బాలల అభివృద్ధి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: బాలలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ మాజీ డైరెక్టర్ బి. రమేష్ ప్రసాద్ పేర్కొన్నారు. విశాఖ నుంచి జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు హాజరవుతున్న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ బాల కళాకారులను ఆదివారం ఉదయం సీతమ్మధార ఏపీఎస్ఈబీ కమ్యూనిటీ హాల్లో ఘనంగా సత్కరించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజం కోసం పాటు పడే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నవంబర్‌లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభావంతులైన బాలలను సత్కరించాలన్నారు. విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రధాని, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న చిన్నారులకు సైతం విశాఖలో తగిన గుర్తింపు లేదన్నారు.వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా నేషనల్ కల్చరల్ ఫెస్టివల్‌కు హాజరవుతున్న హర్షిత టీనా, పూజిత చందన, జోషిత, డింపుల్, స్నేహితులను సత్కరించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి, కొరియోగ్రాఫర్, సీనియర్ జర్నలిస్ట్ నాగరాజ్ పట్నాయక్, ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ చైర్మన్, సింగర్ కె. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సాహం


ఫైనల్‌కు చేరిన విశాఖ బాలికల జట్టు

అగనంపూడి: క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం నూతన పాలసీ ప్రకటించిందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన రెండో రోజు నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు కూడా రూ.లక్ష నజరానా ఇవ్వనున్నట్టు చెప్పారు. క్రీడాకారులు పోటీతత్వంతో పాటు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రేమ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం సూర్య ప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు, వెంకటరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.దేముడు పాల్గొన్నారు.
ఫైనల్‌కు చేరిన విశాఖ బాలికల జట్టు
ఆదివారం నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి విశాఖ బాలికల జట్టు నెల్లూరు జట్టుపై 28–8 తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. సోమవారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది పీడీలు మన్నాజీ, నారాయణరావు, వెంకటరావు తెలిపారు.

### 'రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం'

సీతంపేట: భారత రాజ్యాంగాన్ని మార్చివేసే ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయని, ఆ ప్రక్రియను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ ఎం.నరసింగరావు పిలుపునిచ్చారు. రామా టాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం, దేశాన్ని కాపాడుకుందాం పిలుపుతో దేశంలోని పలు రాష్ట్రాల్లో రాజ్యాంగ అవగాహన రథయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా యాత్ర పోస్టర్ విడుదల చేశారు. దేశంలో 4 వేల కిలోమీటర్ల దూరం యాత్ర సాగుతుందని తెలిపారు.

### రెండు ముక్కలైన స్కూటీ


ముక్కలైన స్కూటీ

ఆరిలోవ: హనుమంతవాక సమీపాన బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనం రెండు ముక్కలైంది. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా.. ఆదివారం మధ్యాహ్నం ఆదర్శనగర్‌కు చెందిన ముగ్గురు యువకులు స్కూటీపై బీఆర్‌టీఎస్ మధ్య లైన్‌లో పెదగదిలి వైపు వెళ్తున్నారు. అదే లైన్‌లో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు ఓ కారు వస్తోంది. ఆ రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ పాత పందుల ఫారం ముందు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. వారు నడిపిన స్కూటీ రెండు ముక్కలైంది. దాని నుంచి టైర్ విడిపోయింది. బీఆర్‌టీఎస్ మధ్య లైన్‌లో వీవీఐపీ వాహనాలు, ఆర్టీసీ బస్‌లు తప్పా ఇతర వాహనాలు నడపకూడదు. దానికి సంబంధించి ట్రాఫిక్ పోలీసులు కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా పెట్టారు. అయినా వాటిని పట్టించుకోకుండా అదే లైన్‌లో ప్రయాణించి ప్రమాదాలకు కారణమవుతున్నారని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.